# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 31 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4



పాఠకులు, శ్రేయోభిలాషులకు
దీపావళి శుభాకాంక్షలు
పండుగ సందర్భంగా గురువారం
పత్రికకు సెలవు.
శుక్రవారం సంచిక వెలువడదు.
పునఃదర్శనం శనివారం
- బలగం టీవీ సీఈఓ బాలు కాయితి


## కులగణన
# మెగా హెల్త్ చెకప్ లాంటిది

- **నవంబర్ 2న అన్ని జిల్లాల్లో అభిప్రాయ సేకరణకు సమావేశాలు**
- **5 లేదా 6వ తేదీన రాహుల్‌గాంధీని ఆహ్వానించి సభ నిర్వహణకు యోచన**
- **నవంబర్ 30లోపు పూర్తి**
- **గాంధీ కుటుంబం మాట అంటే మాటే**
- **ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి**
- **జనగణనలోనే కులగణన కూడా చేపట్టాలి**
- **సీఎం రేవంత్‌రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదు.. ఇది మెగా హెల్త్ చెకప్ లాంటిదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.గాంధీ కుటుంబం మాట ఇచ్చిదంటే అది శిలాశాసనమని చెప్పారు. మాట అంటే మాటే అన్నారు. ఆ కుటుంబం ఇచ్చిన మాట ప్రకారం కుల గణనను చేపడుతున్నట్టు తెలిపారు.

ఇక దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది నిర్వహించనున్న జనగణనలోనే కులగణన కూడా చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం తీర్మానం చేసింది. రాష్ట్రంలో వచ్చే నెల ఆరోతేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన కులగణనపై చర్చించేందుకు గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దీనిని ఆమోదించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ నేత కొప్పుల రాజుతోపాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వచ్చే నెల 2న కులగణన అంశంపై జిల్లా స్థాయిలో డీసీసీల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని.. భాగస్వామ్య పక్షాలను ఆహ్వానించి విస్తృతస్థాయి చర్చ జరపాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే నెల 5న లేదా 6న రాష్ట్రస్థాయిలో మేధావులు, సామాజికవేత్తలు, ముఖ్యులతో భేటీ జరపాలని.. వారిచ్చే సలహాలు, సూచనలకు అనుగుణంగా కులగణన ప్రక్రియపై ముందుకెళ్లాలని ఆలోచనకు వచ్చారు. కులగణనపై రాష్ట్రంలో సభ నిర్వహించాలని, దీనికి రాహుల్‌గాంధీని ఆహ్వానించాలని నిర్ణయించారు.

సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటైన తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన చేస్తామని గత ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. గాంధీ కుటుంబం ఒకమాట ఇస్తే ఎవరు అడ్డువచ్చినా నెరవేర్చి తీరుతుంది. అప్పుడు తెలంగాణ ఏర్పాటు ద్వారా, ఇప్పుడు కులగణన ద్వారా ఇది నిరూపితమైంది.." అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ విధానమని.. ఈ క్రమంలో ప్రతిక్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులు, నాయకులపై ఉందని చెప్పారు. కులగణనలో భాగస్వాములను చేసేందుకు 33 జిల్లాలకు 33 మంది పరిశీలకులను నియమించాలని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు రేవంత్ సూచించారు. కులగణన విషయంలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్ కావాలని, ఈ మోడల్ రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని వ్యాఖ్యానించారు.

రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను అమలు చేసే క్రమంలో ఎవరు అడ్డు వచ్చినా, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కులగణన కేవలం ఎక్స్‌రే మాత్రమే కాదని.. మెగా హెల్త్ చెకప్ వంటిదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమన్నారు. నవంబర్ 31లోగా రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి తెలంగాణ నుంచే నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జనగణనలో భాగంగా ఓబీసీల కులగణన చేపట్టడం కోసం.. రాష్ట్రంలో జరిగే కులగణన డాక్యుమెంట్‌ను పంపుతామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కావాలన్నది కాంగ్రెస్ పార్టీలోని బీసీల నినాదమని.. అయితే గ్రూప్-1 మెయిన్స్‌కు 57 శాతం మంది బీసీలు ఎంపికయ్యారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అగ్రవర్ణాలతోపాటు బీసీలు, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కోటాల కింద ఎంత మంది గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారన్న విషయాన్ని వివరించారు. నవంబర్ ఆరో తేదీ నుంచి చేపట్టనున్న కులగణన కార్యక్రమాన్ని 30వ తేదీలోగా పూర్తి చేస్తామని.. తర్వాత ఈ వివరాలన్నింటినీ హైకోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. డిసెంబర్ 7న రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. ఆ రోజుకల్లా స్థానిక రిజర్వేషన్లపై కోర్టు తీర్పు వస్తే, డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సంబురాలు జరుపుకోవాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తనకు అన్నీ చేసిందని, ముఖ్యమంత్రిని చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు మిగిలింది తాను పార్టీకి, ప్రజలకు సేవ చేయడమేనని చెప్పారు. ఈ క్రమంలోనే పార్టీ విధానాన్ని పాటించేందుకు కులగణన చేపడుతున్నామన్నారు. పార్టీ అధికారంలోకి రాకముందు అనుబంధ సంఘాల అధ్యక్ష పదవులు తీసుకోవాలని కోరితే కొందరు ముందుకు రాలేదని.. ఇప్పుడు వారే తాము పెద్ద నాయకులమని, పదవులు ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి చేయాలని, తప్పకుండా ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. ఒక సీఎంగా రేవంత్‌రెడ్డి చట్టాలను అమలు చేస్తాడే తప్ప వ్యక్తిగత ఎజెండాతో కాదని.. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను పార్టీ నాయకత్వం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 3.64 శాతం కరువు భత్యం (డీఏ) పెంచుతున్నట్టు అనౌన్స్ చేసింది. ఇది 2022 జులై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని తెలిపింది. నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లించనున్నారు. 2022 జులై ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెప్పారు. 2025 మార్చి 31వ తేదీ లోపు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లస్తామని ప్రభుత్వం తెలిపింది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేయనున్నారు. 2025 ఫిబ్రవరి నుంచి 90 శాతం డీఏ.. 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతారు. విశ్రాంత ఉద్యోగులకు డీఏ బకాయిలు 2025 జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

## వసతిగృహ విద్యార్థులకు
# ప్రభుత్వం దీపావళి కానుక

- **డైట్ ఛార్జీలతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను పెంచిన రాష్ట్ర ప్రభుత్వం...**
- **డైట్, కాస్మోటిక్ ఛార్జీల పెంపునకు అధికారుల కమిటీ చేసిన సిఫార్సులను ఆమోదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దీపావళి పండుగ వేళ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలు, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఆర్ఈఐఎస్) పరిధిలోని వసతిగృహాల్లో డైట్ ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది.డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలంటూ అధికారుల కమిటీ చేసిన సిఫారసులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదించారు. చార్జీలను పెంచుతూ తయారు చేసిన దస్త్రంపై బుధవారం ఆయన సంతకం చేశారు. ఈ నిర్ణయం వల్ల సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఇప్పటి వరకు రూ.950గా ఉన్న డైట్ ఛార్జీని రూ.1,330కి పెంచిన ప్రభుత్వం...

3వ తరగతి నుంచి ఏడో తరగతి వరకు రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,77,877

8వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఇప్పటి వరకు ఉన్న రూ.1,100గా ఉన్న డైట్ ఛార్జీని రూ.1,540కి పెంచిన ప్రభుత్వం...

8వ తరగతి నుంచి పదో తరగతి వరకు రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,59,328

ఇంటర్ నుంచి పీజీ వరకు ఇప్పటి వరకు ఉన్న రూ.1,500గా ఉన్న డైట్ ఛార్జీని రూ.2,100కి పెంచిన ప్రభుత్వం...

ఇంటర్ నుంచి పీజీ వరకు రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,28,500

మొత్తం రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య: 7,65,705

3వ తరగతి నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థినులకు... ఇప్పటి వరకు రూ.55గా ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను రూ.175కు పెంపు...

8 నుంచి పదో తరగతి... 11 సంవత్సరాలపైన ఉన్న విద్యార్థినులకు ఇప్పటి వరకు రూ.75గా ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను రూ.275కు పెంచిన ప్రభుత్వం...

మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఇప్పటి వరకు ఉన్న రూ.62 నుంచి రూ.150కు పెంపు

8 నుంచి పదో తరగతి వరకు... 11 ఏళ్లపైబడిన విద్యార్థులకు ఇప్పటి వరకు రూ.62గా ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను రూ.200కు పెంచిన ప్రభుత్వం




# గ్రూప్ 3 పరీక్షల టైంటేబుల్ విడుదల..
## నవంబర్ 17, 18 తేదీల్లో పరీక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల గ్రూప్-3 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది.ఈ పరీక్షలు నవంబర్ 17, 18 తేదీల్లో జరగనున్నాయి. వచ్చే నెల 17న రెండు సెషన్లలో రెండు పేపర్లకు పరీక్ష ఉంటుంది. 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మొదటి సెషన్‌లో ఫస్ట్ పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి 5:30 వరకు సెకండ్ పేపర్ పరీక్ష జరుగుతుంది. 18న తేదీన పేపర్-3 ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు జరుగునుంది.

కాగా పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను నవంబర్ 10వ తేదీ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌కు లాగిన్ అయ్యి తమ హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇదిలా ఉంటే 1,388 పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5,36,477 మంది దరఖాస్తు చేసుకున్నారు

# తెలంగాణలో మయోనైజ్‌పై నిషేధం

- **రాష్ట్ర ఆరోగ్య శాఖ ఉత్తర్వులు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మయోనైజ్ పై నిషేధం విధించింది. ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష అనంతరం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్‌లో వరుసగా మయోనైజ్ తిన్న వ్యక్తులు మరణించడం, తీవ్ర అనారోగ్యం పాలవడం కలకలం సృష్టించింది. బంజారాహిల్స్ సింగాడి కుంటలో మోమోస్ తిని ఒక మహిళ చనిపోగా..మరో 20 మంది ఆసుపత్రి పాలయ్యారు. వీరందరూ ఆయే హోటళ్ళు, రోడ్డు సైడ్ ఫుడ్ స్టాల్స్‌లో ఇచ్చిన మయోనైజ్ తినడం వల్లనే చనిపోయారని డాక్టర్ రిపోర్ట్‌లలో తేలింది. దీనిన్న దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మయోనైజ్‌ను నిషేధిస్తూ రాష్ట్ర ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటూ రాష్ట్రంలో హోటళ్లు, ఫుడ్‌స్టాళ్లలో తరచూ తనిఖీలు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని రాజనర్సింహ ఆదేశించారు. కల్తీ ఆహారం తీసుకొని పలువురు తీవ్ర అనారోగ్యం పాలవుతోన్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెబుతున్నారు. ఈ మధ్య జరిగిన సఘటనల నేపథ్యంలో ...ఎన్నిసార్లు చెప్పినా హోటళ్ళు తమ తీరు మార్చుకోవడం లేదంటూ బల్దియా ప్రభుత్వానికి లేఖ రాసింది. అందులో మయోనైజ్‌ను నిషేధించాలని కోరింది.





# సచివాలయంలో ఉద్యోగుల బదిలీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సచివాలయంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న 26 మంది ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఏడుగురు అదనపు కార్యదర్శులు, ఏడుగురు సంయుక్త కార్యదర్శులు, 12 మంది డిప్యూటీ కార్యదర్శులను, వారు పని చేస్తున్న శాఖల నుంచి ఇతర శాఖలకు బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారులను వెంటనే రిలీవ్ చేసి కొత్త వారిని ఆయా శాఖలు విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## కుర్చీని ఎప్పుడు
# గుంజుకుపోతారోనన్న భయంలో రేవంత్



- **సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష**
- **మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీనియర్లు తన కుర్చీని గుంజుకోకుండా రేవంత్ చేసుకోవాలని.. తన కుర్చీని ఎప్పుడు గుంజుకుపోతారోనన్న భయంలో రేవంత్ ఉన్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్ష అని స్పష్టం చేశారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని.. రేవంత్ సీఎం అయ్యేవాడు కాదన్నారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు.

తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఐదేళ్ల తర్వాత వచ్చేది బీఆర్ఎస్ మాత్రమేనని.. సీఎం అయ్యేది కేసీఆర్ అని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడుసార్లు ఓడిందని.. మరి కాంగ్రెస్ ఖతం అయిపోయిందా? అంటూ ప్రశ్నించారు. 31 సాకులు చూపుతూ రుణమాఫీ చేయకుండా రేవంత్ రైతులను మోసం చేశారని విమర్శించారు. ఆరు మంత్రి పదవులు నింపేందుకే రేవంత్‌కు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదని.. విద్య, మైనారిటీ, పోలీసుశాఖలకు మంత్రులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ లేరన్నారు. కేసీఆర్ పవర్‌ఫుల్ ఫైటర్, లీడర్ అని చెప్పారు. రేవంత్‌రెడ్డి చిల్లరమాటలు ఆపితే మంచిదని సూచించారు.

ఓ మంత్రి గవర్నర్‌ని కలిశారని.. ఇంకో మంత్రి కాబోయే సీఎంనని సోషల్ మీడియాలో పెట్టుకుంటున్నారన్నారు. సీఎం చిట్‌చాట్‌లో మాట్లాడి కుర్చీకి ఉన్న గౌరవం తగ్గించారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి అబద్దాలు చూసి గోబెల్స్ కూడా సిగ్గుపడుతారన్నారు. రేవంత్ మాట్లాడితే ఎక్కడ ఆ దుర్భాష విని పిల్లలు చెడిపోతారోనని ఇండ్లల్లో తల్లిదండులు టీవీలను బంద్ చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు మూడువైపులా సముద్రం ఉందంటారని.. అలా అయితే గోవా వెళ్లడం ఎందుకని జోకులు వేస్తున్నారన్నారు. రాజీవ్ కంప్యూటర్ కనిపెట్టాడని అంటాడని.. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతారని.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండీ ఇలా మాట్లాడుతూ పోతే.. గ్రూప్-1 పరీక్ష రాసేవాళ్లు ఏమైపోవాలి? అన్నారు.

సీఎం కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. సన్యాసం తీసుకోకుండా ఎంపీకి ఎందుకు పోటీశారని నిలదీశారు.రేవంత్ తప్పుడు విధానాలతో రియల్ ఎస్టేట్ పడిపోయిందని చెప్పారు హరీశ్ రావు.

# ఇండ్లను ఆక్రమించుకున్నవారిని
## తక్షణం ఖాళీ చేయించండి

- **అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రంగారెడ్డి జిల్లా ఎల్. బి. నగర్ నియోజకవర్గం పరిధిలోని నందనవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకున్నవారిని తక్షణం ఖాళీ చేయించి అర్హులైన వారికి అందించాలని రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, నందనవనంలో ఉన్న ఇండ్ల సమస్య, కేటాయింపుపై అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాష్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ డి. దివ్య, ప్రస్తుత రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన డాక్టర్ ఎస్. హరీష్, కె. శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్రమంగా ప్రభుత్వ ఇండ్లను ఆక్రమించుకున్నవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఎలాంటి రాజకీయ వత్తిడులకు తలొంగ వద్దని అధికారులకు సూచించారు.నందనవనంలో జె ఎన్ యూ ఆర్ ఎం పథకం కింద ప్రభుత్వం నిర్మించిన ఇండ్ల కోసం 2019లో దరఖాస్తు చేసుకొని, లబ్ధిదారుని వాటా చెల్లించిన వారి ఇండ్లను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకోవడం పట్ల మంత్రి తీవ్రంగా స్పందించారు. బాధితులకు న్యాయం చేయాలని , అక్రమంగా ఆక్రమించుకున్న వారినుంచి ఇండ్లు స్వాధీనం చేసుకొని వారికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు అధికారులను ఆదేశించారు. అలాగే మంకాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో ఉన్న న్యాయపరమైన సమస్యలను తక్షణం పరిష్కరించి, అర్హులైన వారికి కేటాయించాలని అధికారులకు సూచించారు. ఈ రెండు అంశాలపై పూర్తిస్థాయి నివేదికను తనకు అందించాలని, వీలైనంత త్వరితగతిన ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు అన్యాయం జరిగితే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. ప్రజావాణిలో గృహనిర్మాణానికి సంబంధించి వచ్చే ఫిర్యాదులను సచివాలయంలోని తన కార్యాలయానికి పంపించాలని నోడల్ అధికారికి దివ్యకు సూచించారు.వాటి పరిష్కారానికి తన కార్యాలయంలో ఒక ప్రత్యేక అధికారికి బాధ్యతలు అప్పగించడం జరుగుతుందన్నారు.



## బీసీల లెక్కల కోసం
# ప్రత్యేక కమిషన్‌ను నియమించండి

- **రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.**
- **బీసీ కమిషన్‌కు అప్పగించడం చెల్లదంటూ ఆర్.కృష్ణయ్య పిటిషన్**

మిగితా 3వ పేజీలో

# టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు..

- **24 మంది ప్రముఖులతో కొత్త బోర్డు నియామకం**
- **తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి నూతన చైర్మన్‌గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు. 24 మంది సభ్యులతో టీటీడీ పాలకమండలి ఏర్పాటు కానుంది. వీరిలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు లభించింది. ఈ మేరకు టీటీడీ అధికారిక ప్రకటన విడుదల చేసింది.



**టీటీడీ బోర్డు చైర్మన్: బీఆర్ నాయుడు**

**టీటీడీ సభ్యులు :** జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి, జాస్తి పూర్ణ సాంబశివరావు, నన్నపనేని సదాశివరావు, కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, ఆర్.ఎన్.దర్శన్, జస్టిస్ హెచ్.ఎల్.దత్, పి.రామ్మూర్తి, తమ్మిశెట్టి జానకీదేవి, బి.మహేందర్‌రెడ్డి, అనుగోలు రంగశ్రీ, సుచిత్ర ఎల్లా, బూరగపు ఆనందసాయి, నరేశ్ కుమార్, డా.అదిత్ దేశాయ్, సౌరభ్ హెచ్ బోరా

**తెలంగాణ నుంచి సభ్యులైన వారు:** నన్నూరి నర్సిరెడ్డి, బుంగునూరు మహేందర్ రెడ్డి, అనుగోలు రంగశ్రీ, బూరగాపు ఆనందసాయి, సుచిత్ర ఎల్ల

# ఆరోగ్య అవగాహన కల్పించాలి.. పరీక్షలు నిర్వహించాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం వైద్య ఆరోగ్య శాఖపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు, ఎయిడ్స్, టీబీ, కుష్టు తదితర కేసులపై క్షుణ్ణంగా చర్చించారు. జిల్లాలో ఎన్ని కేసులు నమోదు అయ్యాయి, వారికి ఎలాంటి వైద్య సేవలు, మందులు అందిస్తున్నారో ఆరా తీశారు. ఎయిడ్స్, టీబీ, కుష్టు నిర్ధారణకు కావాల్సిన కిట్లు, మందుల పై ఆరా తీశారు. జిల్లాలో మొత్తం టీబీ కేసులు 831, ఎయిడ్స్ కేసులు 550, కుష్టు కేసులు 14 ఉన్నాయని దృష్టికి జిల్లా వైద్య అధికారి వసంత రావు తీసుకెళ్లారు.కేసులు ఎక్కడ నమోదు అవుతున్నాయి, కారణాలు ఏమిటి నియంత్రణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా సమీక్ష నిర్వహించి, పురోగతి తెలుసుకోవాలని జిల్లా వైద్య అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

సాంస్కృతిక కళాకారులతో విద్యాలయాలు, రద్దీ ప్రాంతాలు, జాతర ప్రదేశాల్లో ఎయిడ్స్, టీబీ, కుష్టు వ్యాప్తి, డ్రగ్స్ వాడడంతో కలిగే ఇబ్బందులు, వ్యాధులు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని,జిల్లా ప్రభుత్వ దవాఖాన, ఏరియా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య అధికారి వసంత రావు, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ ఓలు రాజగోపాల్, రజిత తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శిక్షణ కార్యక్రమం



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సి.ఇ.ఓ, యస్.వినోద్ (మండల ప్రత్యేక అధికారి) ఆధ్వర్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే చేయుటకు ఎన్యూమనేటర్స్ (98), సుపర్వేజర్స్ (11) లకు టి.ఓ.టి ఉపాధ్యాయులచే శిక్షణ కార్యక్రమము తీసుకోవడము జరిగింది. ఈ కార్యక్రమంలో యం.పి.డి.ఓ జయశీల, తహశీల్దార్ కె.నారాయణ రెడ్డి, యం.పి.ఓ శ్రీధర్, మండల ఎ.ఇ, మండల హెల్త్ సుపర్వేజర్స్, ఎ.యన్.యం, ఐ.కె.పి.ఎ.పి.యం, ఐ.సి.డి.యస్ సిబ్బంది, ఎ.పి.ఓ సబిత, మండల పరిషత్ సిబ్బంది, అన్ని గ్రామల పంచాయతి కార్యదర్శిలు, మండల పరిషత్ కంప్యూటర్ ఆపరేటర్స్, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా కమిషన్ చైర్మెన్‌తో విద్యా రంగ సమస్యలపై సమావేశం

**బలగం టీవీ , హైదరాబాద్**

తెలంగాణ విద్యారంగ సమస్యల మరియు సూచనలు పై బుధవారం తెలంగాణ తొలి విద్యా కమిషన్ చైర్ పర్సన్ ఆకునూరు మురళితో హైదరాబాదులో సమావేశం అయినట్లు ,తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వసుకుల శ్రీనివాస్ ,డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగంలో పరిస్థితులు సమస్యలు పరిష్కారం సూచనలు తెలుసుకోవడానికి తమ సంఘమును తెలంగాణ రాష్ట్ర తొలి విద్యా కమిషన్ ఆహ్వానించడం జరిగిందని తెలుపుతూ, తమ సంఘ గౌరవ సలహాదారు డాక్టర్ అందే సత్యం గారు నేతృత్వంలో రాష్ట్ర నాయకులు ,జిల్లా నాయకులు హైదరాబాదులో విద్యా కమిషన్ ఆఫీసులో విద్యా కమిషన్ చైర్ పర్సన్ తో సమావేశం జరిపినట్లు తెలుపుతూ, ముందుగా కమిషన్ ఏర్పాటు మరియు చైర్మన్ సభ్యులు సలహా సంఘం ఏర్పాట్లు స్వాగతిస్తూ అభినందనలు తెలియజేయడం జరిగింది. అనంతరం దేశంలోని, రాష్ట్రంలోని విద్యారంగ పరిస్థితిని తెలియజేస్తూ ,తెలంగాణ రాష్ట్రంలో గత 23 సంవత్సరాలుగా తమ సంఘం సభ్యులు క్షేత్రస్థాయిలో ఉన్నత విద్యారంగంలో పని చేస్తూ ఉన్నత విద్యారంగంలో ప్రభుత్వ ఇంటర్ విద్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్య, టెక్నికల్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ విద్యపై, ప్రస్తుత పరిస్థితి ,సమస్యలు ,అభివృద్ధి కొరకు పలు సూచనలతో కూడిన రిపోర్ట్ను ఇవ్వటం జరిగింది అని తెలిపారు .

## ఇంటర్ విద్య పై సూచనలు

ప్రస్తుతం2024-2025 విద్యా సంవత్సరంలో, ఇంటర్ విద్యలో వివిధ క్యాటగిరీలకి చెందిన చెందిన 3019 జూనియర్ కళాశాల లు ఉండటం జరిగిందని ,ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 424 కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రథమ ద్వితీయ సంవత్సరం (జనరల్ ఒకేషనల్) సుమారు ఒక లక్ష 70,000 మంది విద్యార్థులు జాయిన్ కావడం జరిగిందని తెలుపుతూ, ప్రస్తుతం ఇంటర్ విద్య లో వస్తున్న పలు మార్పులను విద్యా కమిషన్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంత ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తగ్గుతున్నాయని, పట్టణ ప్రాంతంలోని కళాశాలలో అడ్మిషన్లు పెరుగుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఎంపీసీ ,బైపీసీ గ్రూపులలో విద్యార్థులు జాయిన్ కావడం రాను రాను తగ్గుతుందని తెలిపారు.

హై స్కూల్ కి మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సమన్వయం తగ్గుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత జూనియర్ కళాశాలలో చాలాచోట్ల విద్యార్థులు అటెండెన్స్ తక్కువైతుందని, డ్రాప్స్ పెరుగుతున్నారని తెలిపారు .

దీనికి కారణం విద్యార్థుల సామాజిక ,ఆర్థిక సంబంధాలు కారణంగా తెలుపుతూ, చాలామంది విద్యార్థులు వారి కుటుంబంలో ఇంటర్ వరకు ఫస్ట్ జనరేషన్ చదువుతున్నారని, వారి కుటుంబ సభ్యుల పర్యవేక్షణ లోపిస్తుందని వారు చదువును రెండో ప్రాధాన్యతగా పరిగణిస్తున్నారని ,విద్యార్థుల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయ సీజన్ కాలంలో మరియు గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటి ఆర్థికంగా చేయూత ఇచ్చే కార్యక్రమాల్లో కళాశాలకు హాజరు కావట్లేదు అని తెలిపారు. బిబిప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే స్కాలర్షిప్లను ప్రతి నెల విద్యార్థులకు చెల్లిస్తే వారికి కొంత ఆర్థికంగా చేయూత ఇచ్చినట్లు అవుతుందని విద్యార్థులు అటెండెన్స్ పెరుగుతుందని తెలిపారు.అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం పెట్టడం వల్ల విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధికి తోడ్పడుతూ చదువుకు దోహదపడుతుందని తెలిపారు. గతంలో కొంతమంది దాతలతో పరీక్షల సమయంలో మధ్యాహ్నం భోజన పథకం పెట్టిన కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెరుగుతున్నట్లు గమనించమని తెలిపారు. బిబిప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల అడ్మిషన్లు లో ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనార్టీ విద్యార్థులే 99% చేరుతున్నారని తెలిపారు .

పౌర సమాజం మరియు ప్రజల భాగస్వామ్యము ప్రభుత్వ జూనియర్ కళాశాల పై ప్రభావం లేదని తెలిపారు .ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు మరియు పౌర సమాజం భాగస్వామ్యం పెంచాలని కోరారు. బిబికేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్య అభివృద్ధి కొరకు మంత్రులు, శాసనసభ్యులు శాసనమండలి సభ్యులతో ,ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో మూడు నెలలకు ఒకసారి ప్రభుత్వ విద్యా సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగుల మానవ వనరులను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవటానికి సరైన ప్రణాళిక రూపొందించాలని కోరారు, టీచింగ్ , నాన్ టీచింగ్ సిబ్బందికి మారుతున్న మార్పులు కనుగుణంగా ఇన్ సర్వీస్ ట్రైనింగ్ నిరంతర ఇవ్వాలని కోరారు. బిబిబిటీచింగ్ ,నాన్ -టీచింగ్ సిబ్బందికి మోరల్ ఎథిక్స్ సోషల్ కాన్సెప్ట్ కమిట్మెంట్ దృక్పథాన్ని పెంచాలని కోరారు.

తెలంగాణ రాష్ట్రంలో 10 లక్షల మంది విద్యార్థులు చదువుతున్న ఉన్నత విద్యలో కీలకమైన ఇంటర్ విద్యారంగానికి జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఏడుగురు జిల్లా ఇంటర్ విద్యాధికారులు మాత్రమే ఉన్నారని, ఇంకా 27 జిల్లాలకు డీఐఈఓ పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

ఇంటర్ విద్య ,కార్పొరేట్ కళాశాలల అక్రమాలపై విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వ నియమించిన ప్రొఫెసర్ నిరదారెడ్డి రెడ్డి కమిషన్ రిపోర్ట్ను బహిరంగపరచాలని కోరారు. బిబినూతనంగా నెలకొల్పిన 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలకు టీచింగ్ ,నాన్- టీచింగ్ పోస్టులు మంజూరు చేసి వెంటనే నియమించాలని కోరారు

కరోనా అనంతరం విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం కనబడుతుందని . దీని ప్రభావం వలన విద్యార్థుల సృజనాత్మకత దెబ్బతింటుందని, వీటిని అదుపు చేయటానికి సరైన పర్యవేక్షణ నియమాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్నత విద్యారంగంలో యూనివర్సిటీ ,డిగ్రీ ,టెక్నికల్ ఇంటర్ ఎడ్యుకేషన్లో ,కాంట్రాక్టు, పార్ట్ టైం ,గెస్ట్ ఫ్యాకల్టీ ,టెంపరరీ, ఔట్సోర్సింగ్ లాంటి పద్ధతుల ద్వారా టీచింగ్ ,నాన్ బిటీచింగ్ నియామకాలు చేపట్టి వారికి అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని, ఉద్యోగ భద్రత ఉండటం తెలుపుతూ, వీరికి క్రమబద్ధీకరణ మరియు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పూర్తి వేతనాలు చెల్లించాలని, భవిష్యత్తులో ఈ నియామకాలు నిలుపు చేసి శాశ్వత నియమకాలు చేపట్టాలని కోరారు బిబికీలకమైన ఇంటర్ విద్యకు, తెలంగాణ ఇంటర్ బోర్డుకు, పూర్తిస్థాయిలో కార్యదర్శులు డైరెక్టర్ ను ,టెక్నికల్ మరియు కళాశాల విద్యకు పూర్తిస్థాయిలో కమిషనర్ను నియమించాలని కోరారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం 2020 పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి విద్య వెళ్ళేటట్లు కనబడుతుందని ,సమైక్య విధానానికి ,రాజ్యాంగ స్ఫూర్తికి ఇది విరుద్ధమని , ఆర్థిక వనరులు కారణంతో రాష్ట్ర ప్రభుత్వం ,కేంద్ర ప్రభుత్వానికి విద్య విషయంలో జాతీయ విద్యా విధానాన్ని ఒప్పుకోవద్దని తెలుపుతూ, రాష్ట్రంలో తెలంగాణ విద్య అస్తిత్వాన్ని కాపాడటానికి జాతీయ విద్యా విధానం విషయంపై పునరాలోచించి రిపోర్ట్ ఇవ్వాల్సిందిగా విద్యా కమిషన్ కి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.



# హైస్కూల్లో ముందస్తు దీపావళి వేడుకలు

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ హైస్కూల్లో బుధవారం రోజున పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందస్తుగా దీపావళి పర్వదిన వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మూకుమ్మడిగా టపాకాయలు పేల్చి, ఎగసిపడే చిచ్చు బుడ్లు,కాంతులు విరజిమ్మే కాకర పూలు, ఆనందోత్సాహాలతో, ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిపారు.ఈ సందర్భంగా హెచ్ఎం బొలగం శ్రీనివాస్ మాట్లాడుతూ: విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, ప్రతి పండుగలకు సాంప్రదాయ రీతిలో కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పండుగల ప్రత్యేకతను తెలుసుకోవాలని, టపాకాయలు కాల్చే ముందు జాగ్రత్తలు తీసుకుని కాల్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# యువతి ప్రేమ నిరాకరించిందని యువకుడు ఆత్మహత్య

**బలగం టీవీ , హైదరాబాద్**

అమ్మాయి తన ప్రేమను నిరాకరించిందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన ఎం.రాజశేఖర్ (31) జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఓ ప్రయివేటు కంపెనీలో హెచ్ఆర్‌గా పని చేస్తున్నాడు. అతను ఓ అమ్మాయిని ప్రేమించ మంటూ వెంటపడుతూ... ఆమెకి తన ప్రేమను వ్యక్తపరిచాడు. అయితే ఆమె అందుకు నిరాకరించింది. దీంతో ఎం.రాజశేఖర్ మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవఖానాకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# 8 మంది నక్సల్స్ అరెస్టు

**బలగం టీవీ , హైదరాబాద్**

ఛత్తీస్‌ఘఢ్ సుక్మా జిల్లాలో మూడు వేర్వేరు ప్రదేశాల నుంచి ఎనిమిది మంది నక్సలైట్లను అరెస్టు చేసినట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. చింతల్‌నార్ పోలీస్ స్టేషన్ ప్రాంతం నుంచి ఆరుగురు కేడర్‌లను. కోంటా, చింతగుఫా పోలీస్ స్టేషన్ పరిధులలో నుంచి ఒక్కొక్క నక్సల్‌ను పట్టుకున్నట్లు పోలీస్ అధికారి ఒకరు తెలియజేశారు. రాష్ట్ర పోలీస్ జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), సిఆర్‌పిఎఫ్165వ, 150వ బెటాలియన్లు, కోబ్రా 201వ బెటాలియన్ సమష్టి బృందాలు ఆ అరెస్టుల్లో పాలుపంచుకున్నట్లు ఆయన తెలిపారు. చింతల్‌నార్ నుంచి అరెస్టు చేసిన కేడర్‌ల దగ్గర నుంచి డిటొనేటర్ వైర్లు, బాణసంచా, డిటొనేటర్లు, కార్డెక్స్ వైర్ (పేలుడు పదార్థాల్లో ఉపయోగించేది), మావోయిస్ట్ బ్యానర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆ అధికారి తెలిపారు.

### బీసీల లెక్కల కోసం

# ప్రత్యేక కమిషన్‌ను నియమించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.
- బీసీ కమిషన్‌కు అప్పగించడం చెల్లదంటూ ఆర్.కృష్ణయ్య పిటిషన్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో బీసీల జనాభా లెక్కలు తీసేందుకు శాస్త్రీయమైన పద్ధతిలో విచారణ చేపట్టడానికి ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను రెండు వారాల్లో నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా లెక్కలు తేల్చేందుకు ప్రత్యేక కమిషన్ తప్పనిసరి అని పేర్కొంది. బీసీల జనాభాను లెక్కించే పనిని బీసీ కమిషన్‌కు అప్పగించడం చెల్లదని.. ఇందుకు రాజ్యాంగంలోని నిబంధనలు అంగీకరించవని పేర్కొంటూ మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, మాజీ అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. బీసీ కమిషన్‌ను డెడికేటెడ్ కమిషన్‌గా గుర్తిస్తూ సెప్టెంబరు 6న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 199 చెల్లదని పేర్కొన్నారు.

బీసీ కమిషన్‌ను డెడికేటెడ్ కమిషన్‌గా గుర్తించడం ఆర్టికల్ 243(డీ), 243(టీ)కి విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే 'డాక్టర్ కే కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా', 'వికాస్ కిషన్‌రావు గవాలి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర'పై సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను కొట్టేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడానికి ఏకకాలంలో కచ్చితమైన, శాస్త్రీయమైన లెక్కలు తీయడానికి ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను నియమించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బీసీ కమిషన్ బీసీల లెక్కలు తీసే పనిని ప్రారంభించిన నేపథ్యంలో దానిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఏకకాలంలో శాస్త్రీయ పద్ధతిలో కచ్చితమైన బీసీల లెక్కలు తీసేందుకు సుప్రీంకోర్టు చెప్పిన విధంగా డెడికేటెడ్ కమిషన్‌ను రెండు వారాల్లో ఏర్పాటు చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

## సెక్రటేరియట్ సెక్యూరిటీ నుంచి బెటాలియన్ కానిస్టేబుళ్ల తొలగింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని భద్రతలో మార్పులు చేపట్టింది. సెక్రటేరియట్ సెక్యూరిటీ నుంచి బెటాలియన్ కానిస్టేబుళ్లను తొలగించింది. ఇప్పటివరకు సచివాలయ భద్రతను ఈ బెటాలియన్ కానిస్టేబుళ్లే పర్యవేక్షించారు. ప్రస్తుతం వారు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి సెక్రటేరియట్‌లో ఎస్పీఎఫ్ పోలీసులు గస్తీ కాయనున్నారు. తెలంగాణ సెక్రటేరియట్ భద్రలో మార్పులు చేస్తూ.. బుధవారం రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని, ఐదేళ్ల పాటు తమను ఒకే చోట పనిచేయించాలని, ఆ తర్వాత ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ ఇప్పించాలని బెటాలియన్ కానిస్టేబుళ్లు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. తమను వెట్టిచాకిరి కోసం వాడుకుంటున్నారని కూడా పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో పోలీస్ ఇప్పటిదాకా 49 మందిని సస్పెండ్ చేసింది. మరోవైపు హైదరాబాద్‌లో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## నవంబర్ 6 నుంచి కుల గణన

- అఖిలపక్షం సహకరించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

**:బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన ప్రక్రియ తెలంగాణలో నవంబర్ 6వ తేదీన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో అధికారులకు సహకరించాలని సూచించారు. 150 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు.

## ఉద్యమంపై రేవంత్ గన్ను ఎక్కుపెడితే..కేసీఆర్ ప్రాణాలనే పణంగా పెట్టిండు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్

**:బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

'రేవంత్‌రెడ్డీ.. నువ్వు ఉద్యమకారులపై గన్ను ఎక్కిపెట్టిననాడు కేసీఆర్ ఉద్యమానికి తన ప్రాణాలనే పణం గా పెట్టిండు. నువ్వు చెప్పు మోసిననాడు కేసీఆర్ ఉద్యమానికి ఊపిరిపోసిండు. నువ్వు పదవుల కోసం పరితపిస్తున్ననాడు.. ఉన్న పదవిని కేసీఆర్ తృణప్రాయంగా వదిలేసిండు. సాధించుకున్న తెలంగాణను నువ్వు చం పేందుకు బ్యాగు లు మోస్తున్ననాడు కేసీఆర్ తెలంగాణ భవిష్యత్తుకు ఊపిరి పోసిండు.. చిట్టినాయుడూ.. నువ్వా కేసీఆర్ పేరును తుడిచేది?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడమే తన లక్ష్యమని మాట్లాడిన రేవంత్ తీరుపై కేటీఆర్ బుధవారం ఎక్స్ వేదికగా మం డిపడ్డారు.

అలాగే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు దిక్కులేదని కేటీఆర్ మండిపడ్డారు. 'మూసీపై ముందుకు ధాన్యం కొనుగోళ్లపై వెన క్కా?' అని ప్రశ్నించారు. 'దామగుండం ధనాధన్.. ధాన్యం కొనుగోళ్లు ఢాం.. ఢాం..కొనుగోళ్లకు దిక్కులేదు.. కాంగ్రెస్ కోతలకు కొదవలేదు' అని ఎద్దేవాచేశారు. దళారులకు దండిగా..రైతన్నకు సర్కార్ దండుగలా మారిందని నిప్పులు చెరిగారు. నాడు క్వింటాకు రూ.2300కు అమ్ముకున్న రైతు, కాంగ్రెస్ పుణ్యమా అని నేడు రూ. 1800కే అమ్ముకుంటున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదనే సోయి సర్కార్‌కు ఉండాలి' అని సూచించారు.



### చారిత్రిక బాధ్యతలో

## ఉపాధ్యాయులను భాగస్వాములను చేస్తున్నాము



- సర్వే కోసం ఉపాధ్యాయ సంఘాల సూచనలు ఆచరణలో పెడతాం
- ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చారిత్రాత్మక కుల గణన సర్వేలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్లతో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు, సర్వే ప్రాధాన్యత, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనను డిప్యూటీ సీఎం వివరించారు.

ఇందిరమ్మ రాజ్యం అధికారంలోకి వస్తుంది, ఈ దేశ వనరులు అందరికీ సమానంగా పంచాలి, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఎన్నికల సభలో మా ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీ తోపాటు మేమంతా స్పష్టం చేశాం. అనుకున్న మేరకు అధికారంలోకి వచ్చాం. ఎన్నికల హామీలు అమలులో భాగంగా కుల గణన చేపట్టాలని నిర్ణయించాం. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ నిర్ణయించి మీ ఆలోచనలను తెలుసుకోవాలని కోరారు. ఆ మేరకు ఉపాధ్యాయ సంఘాలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయానికి ఆహ్వానించినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. సామాజిక స్పృహ కలిగిన వారు, గురుతర బాధ్యత ఎరిగిన వారు ఉపాధ్యాయులని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరినట్టు ఉదయం వేళల్లో సర్వే నిర్వహించడం, సెప్టెంబర్ 9 నుంచి 15 వరకు వరుస సెలవుల మధ్య సర్వే చేపట్టడం, సెలవు రోజుల్లో సర్వే విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు పరిహారంతో కూడిన సెలవులు మంజూరు చేయడం, సర్వేకు సంబంధించి సమాజంలో విస్తృత ప్రచారం చేయాలని ఇచ్చిన సూచనలు అన్నిటిని ఆచరణలో పెడతామని డిప్యూటీ సీఎం తెలిపారు. సర్వే విధుల్లోకి వెళ్లే ఉపాధ్యాయ, ఉద్యోగ లోకానికి సమాజం పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతుందని తెలిపారు. అద్భుతమైన సమాజాన్ని తెలంగాణలో నిర్మించేందుకు ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నడవాలని కోరారు. సోషియో, ఎకనామిక్ ఎడ్యుకేషన్, పొలిటికల్ ఎంప్లాయిమెంట్ రంగాల్లో ఎవరెవరు ఎక్కడెక్కడ ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకునేందుకు సర్వే ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

గతంలో మేము చేపట్టిన సకల జనుల సర్వే ఎటు పోయిందో ఎవరికి తెలియదని, ప్రస్తుత ప్రభుత్వం కోరుకున్న విధంగా సర్వే చేయడానికి ఉపాధ్యాయ లోకం సంపూర్ణంగా సిద్ధంగా ఉందని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సౌకతలి తెలిపారు. ఉపాధ్యాయులు అయితేనే సర్వే బాగా చేస్తారని నమ్మకం మాపై ఉంచినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు అని పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి తెలిపారు. సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు %ఎఎశ్రీ% పరిహారంతో కూడిన సెలవును మంజూరు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య కోరారు. సర్వేలో పాల్గొని ఉపాధ్యాయులకు స్పెషల్ %జూ% తోపాటు, ఇన్సెంటివ్ ఇవ్వాలని డిటిఎఫ్ అధ్యక్షుడు లింగారెడ్డి కోరారు. ఆదివాసి ఉపాధ్యాయ సంఘం ఏర్పడి 12 ఏళ్లు కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే సమావేశాలకు ఆహ్వానించి గౌరవిస్తున్నందుకు ధన్యవాదాలు అని ఆదివాసి టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి తెలిపారు. ఎన్నికలు, జన గణన వంటి కీలక కార్యక్రమాలు ఉపాధ్యాయులు లేకుండా పూర్తి కావని, కుల గణన సర్వేలోనూ సంపూర్ణంగా సహకరిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసేవి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సందర్భంలోనూ మమ్ములను పిలిపించి మాట్లాడుకుని మా అభిప్రాయాలు తెలుసుకుంటుందని మోడల్ స్కూల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య అభినందించారు. ఎవరి జనాభా ఎంత ఉందో, ఎక్కడ ఉన్నారో సరిగా లెక్కలు లేవు కాంగ్రెస్ ప్రభుత్వం కూల గణనాథ ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేయడం సంతోషకరమైన విషయమని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జాజుల వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో మొత్తం 13 ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశంలో పాల్గొని వారి అభిప్రాయాలు తెలియజేశారు.

## హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్

**:బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో వంద పడకల నుంచి 250 పడకల స్థాయికి పెంచారు. అప్‌గ్రేడ్‌తో మార్పులు చేయడానికి ప్రభుత్వం రూ.82 కోట్లు మంజూరు చేసింది. అప్‌గ్రైడ్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకి మంత్రి పొన్నం కృతజ్ఞతలు తెలిపారు

# ఆర్‌సీబీ కెప్టెన్‌గా మళ్లీ కోహ్లీ?




బలగం టీవీ, హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ను జట్టు మాజీ సారథి విరాట్ కోహ్లీ మళ్లీ కెప్టెన్ అవ్వనున్నాడా. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2013 నుంచి తొమ్మిదేండ్ల పాటు జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి 2021లో తప్పుకున్న కోహ్లీ.. మళ్లీ వచ్చే సీజన్‌లో సారథ్య పగ్గాలు చేపట్టనున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ఐపీఎల్ రిటెన్షన్స్‌కు గురువారం (అక్టోబర్ 31) సాయంత్రంతో తెరపడనున్న నేపథ్యంలో ఆర్‌సీబీని గత మూడు సీజన్ల పాటు నడిపించిన దక్షిణాఫ్రికా దిగ్గజం ఫాఫ్ డుప్లెసిస్‌ను అతడి వయసు (40 ఏండ్లు) రీత్యా రిటైన్ చేసుకోవడం కష్టమేనని తెలుస్తోంది. మ్యాక్స్‌వెల్ వంటి హిట్టర్‌పైనా బెంగళూరు ఆసక్తి కనబరచడం లేదు. దీంతో మళ్లీ కోహ్లీకే కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పనున్నట్టు బెంగళూరు వర్గాల సమాచారం. ఒకవేళ కేఎల్ రాహుల్ (లక్నో సూపర్ జెయింట్స్), రిషభ్ పంత్ (ఢిల్లీ క్యాపిటల్స్), శ్రేయాస్ అయ్యర్(కోల్‌కతా) వేలంలోకి వస్తే వారిలో ఎవరినో ఒకరిని దక్కించుకుని కెప్టెన్సీ అప్పగించొచ్చన్న పుకార్లూ షికార్లు చేస్తుండగా అనూహ్యంగా కోహ్లీ పేరు తెరపైకి రావడం గమనార్హం. మరి ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ ప్రతిపాదనకు కోహ్లీ అంగీకరిస్తాడా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.

### ఐపీఎల్ రిటెన్షన్స్‌పై ఆర్సీబీ పజిల్

2025 ఐపీఎల్ రిటెన్షన్స్‌కు 24 గంటల సమయం కూడా లేదు. గురువారం సాయంత్రం 5.00 గంటలలోపు అన్ని ఫ్రాంచైజీలు రిటైన్ చేసుకునే ప్లేయర్ల లిస్ట్‌ను సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని జట్లు తాము అట్టిపెట్టుకునే ఆటగాళ్లపై ఓ క్లారిటీకి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు రిటైన్ చేసుకున్న ప్లేయర్ల గురించి ఫ్యాన్స్‌కు ఓ హింట్ ఇచ్చింది. సోషల్ మీడియాలో ఓ పజిల్ షేర్ చేసింది. 'మా రిటెన్షన్స్ రహస్యంగా ఉన్నాయి. ఈ ఆధారాలను అర్థం చేసుకుని కోడ్‌ను ఛేదించగలరా? మా మాస్టర్ ప్లాన్‌ని కనుక్కోండి' అంటూ పోస్టుకు క్యాప్షన్ రాసుకొచ్చింది. ఈ పజిల్‌లో విరాట్ కోహ్లీ, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ఫాఫ్ డుప్లెసిస్, విల్ జాక్స్, కామెరూన్ గ్రీన్, యశ్ దయాళ్, మహ్మద్ సిరాజ్, రజత్ పటిదార్, అనుజ్ రావత్ పేర్లు ఉన్నాయి. అయితే వీరిలో నుంచే ఆర్సీబీ కొంతమందిని అట్టిపెట్టుకునే ఛాన్స్ ఉంది.

# లక్కీ భాస్కర్'పై భారీ అంచనాలు

బలగం టీవీ, హైదరాబాద్




'విడుదలకు ముందే 'లక్కీ భాస్కర్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఆ నమ్మకంతోనే ప్రీమియర్లు వేస్తున్నాం. నిర్మాతగా ఈ సినిమా ఎంతో సంతృప్తినిచ్చింది. ప్రేక్షకులు కూడా తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అని అన్నారు అగ్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఆయన నిర్మించిన 'లక్కీ భాస్కర్' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా నటించారు. బుధవారం సాయంత్రం నుంచే ప్రీమియర్‌షోలు ప్రదర్శితమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ప్రీమియర్స్‌కు మంచి స్పందన వస్తుండటంతో షోస్ సంఖ్య కూడా పెంచాం. బ్యాంకింగ్ నేపథ్యంలో థ్రిల్లర్ జోనర్‌లో నడిచే ఫ్యామిలీ కథాంశమిది. మనిషి డబ్బు సంపాదించాలనుకున్నప్పుడు ఎంత దూరమైనా వెళ్తాడనే పాయింట్ చుట్టూ కథ నడుస్తుంది. సినిమా చూస్తున్న ప్రేక్షకులందరూ భాస్కర్ పాత్రతో కలిసి ప్రయాణం చేస్తారు. అతను గెలవాలని కోరుకుంటారు. ఈ సినిమాలో హీరో ఎవరినీ మోసం చేయకుండా తన తెలివితేటలతో డబ్బు సంపా దిస్తాడు. ఆ పాయింట్ ఆసక్తికరంగా అనిపిస్తుంది' అన్నారు. ఈ సినిమాలో ఎలాంటి సందేశాలు ఉండవనీ, అయితే సినిమా చూసిన వారు మాత్రం మంచి అనుభూతితో బయటకు వస్తారని నాగవంశీ పేర్కొన్నారు.

# హనుమాన్‌గా రిషభ్ శెట్టి




- జై హనుమాన్' ఫస్ట్ లుక్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

తేజ సజ్జ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన చిత్రం హనుమాన్.ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా శ్రీరాముడికి హనుమంతుడు ఇచ్చిన మాటేమిటి అనే ప్రశ్నకు సమాధానంగా 'జై హనుమాన్' చిత్రం తెరకెక్కుతోంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న ఈ మూవీలో హనుమంతుడి పాత్రను ఎవరు పోషిస్తారు అన్న ప్రశ్నకు సమాధానం లభించింది. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. కన్నడ స్టార్ హీరో రిషభ్ శెట్టి హనుమంతుడి పాత్రలో నటించారు. రిషబ్ శెట్టి హనుమంతుడి గెటప్ అదిరిపోయింది. కాంతారతో పాన్ ఇండియా లెవల్‌లో ఫేం తెచ్చుకున్న రిషభ్ శెట్టి ఇప్పుడీ పాన్ ఇండియా సక్సెస్ ఫుల్ మూవీ సీక్వెల్ లో భాగం కావడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారుహనుమాన్ క్లైమాక్స్‌లో చివరి ఐదు నిమిషాలలో వచ్చే హైప్ ఏదైతే ఉందో అదే ఊపు జై హనుమాన్‌లో రెండు గంటలు ఉంటుందని వెల్లడించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచాడు ప్రశాంత్ వర్మ. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్, రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాంతార లాంటి సినిమాతో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన రిషబ్ శెట్టితో ప్రశాంత్ వర్మ సినిమా చేస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.



# ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్..
# బుమ్రాను దాటేసి అగ్రస్థానంలోకి రబాడా

బలగం టీవీ, హైదరాబాద్

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కాగిసో రబాడా భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను దాటేసి అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. రబాడా ఇటీవల బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మ్యాచ్‌లో 300 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. దాంతో టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆయనకు అగ్రస్థానం దక్కింది. రబాడా బంగ్లాతో జరిగిన రెండు టెస్టుల్లో 9 వికెట్లు తీయడం ద్వారా దక్షిణ్ఫ్రికా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతేగాక జస్ప్రీత్ బుమ్రా, జోష్ హాజిల్‌వుడ్, రవిచంద్రన్ అశ్విన్‌లను దాటేసి టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకున్నాడు. ప్రస్తుతం హాజిల్‌వుడ్ రెండో స్థానంలో, బుమ్రా మూడో స్థానంలో, అశ్విన్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. కాగా 2019 తర్వాత రబాడా అగ్రస్థానంలో రావడం ఇదే తొలిసారి.

ఇక బ్యాటింగ్ విభాగంలో టీమ్‌ఇండియా యంగ్ ప్లేయర్ యశస్వి జైశ్వాల్ ఒక స్థానం మెరుగుపర్చుకున్నాడు. 790 రేటింగ్స్‌తో మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లాండ్ సీనియర్ ప్లేయర్ జో రూట్ (903 రేటింగ్స్) టాప్ ప్లేస్‌లోనే ఉన్నాడు. కేన్ విలియమ్సన్ (813 రేటింగ్స్) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక రిషభ్ పంత్ ఐదు స్థానాలు, విరాట్ కోహ్లీ ఆరు స్థానాలు కోల్పోయి టాప్– 10 నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రస్తుతం పంత్ (708) 11వ, కోహ్లీ (688) 14వ స్థానాల్లో ఉన్నారు.



# సీత పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నాను

- సాయి పల్లవి

బలగం టీవీ, హైదరాబాద్

'రామాయణ' చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తున్నది అగ్ర కథానాయిక సాయిపల్లవి. రణబీర్‌కపూర్ రాముడి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి నితేష్ తివారి దర్శకుడు. ఈ సినిమాలో సీత పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నానని సాయిపల్లవి ఆనందం వ్యక్తం చేసింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'చిన్నప్పటి నుంచి రామాయణం వింటూ పెరిగాను. సీతమ్మ పాత్రలో నటించే అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. నాలోని భయాలన్నింటిని పక్కనబెట్టి సీత పాత్ర కోసం సన్నద్ధమవుతున్నా. ఓ నటిగా కాకుండా భక్తురాలిలా సీత పాత్రలో నటిస్తున్నా. నా కెరీర్‌లో ఇదొక అపురూపమైన చిత్రంగా నిలిచిపోతుంది' అని చెప్పింది.